కథా నిలయం
4649
శ్రీకాకుళం

# అసలు సంగతి



సుబ్బారాయుడు కుటుంబ సంక్షేమ శాఖలో ప్రచారకుడిగా చేరాడు.

'ఉదర నిమిత్తం ఉద్యోగం...' అన్నట్లు కాకుండా 'కుటుంబ నియంత్రణ అందరికీ అత్యవసరం!' అని త్రికరణ శుద్ధిగా నమ్మినవాడు అతను. అందుచేత పైవారి ప్రేరేపణ అవసరం లేకుండానే లోన విధులను ఉత్సాహంగా చేస్తూ అచిర కాలంలోనే అధికారుల మన్ననలను పొందాడు.

ఆరోజు ఢిల్లీనుండి కుటుంబ సంక్షేమ శాఖామాత్యులు నగరానికి వచ్చేశారు.

ఆయన తమ సుదీర్ఘ ఉపన్యాసంలో కుటుంబ నియంత్రణ ప్రచార ఆవశ్యకతను గురించి పదేపదే నొక్కి చెప్పారు.

"ఈనాడు దేశంలో ఎన్నో లక్షలమంది కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. ఫలితంగా కోట్లకొద్దీ జననాలు ఆగాయి. ఇంత మాత్రంలో మనం సంతృప్తి చెందడానికి వీలులేదు. ఎందుకంటే... కుటుంబ నియంత్రణని పాటిస్తోంది- ముఖ్యంగా చదువుకున్నవారు, సమాజంలో ఆర్థికంగానూ, ఇతరత్రాను ఉన్నత వర్గాలకు చెందిన వారే! పేద సాదలలో ఇది బాగా తక్కువ. గిరిజనుల్లో అయితే అసలే లేదని చెప్పవచ్చు. కనుక ముఖ్యంగా ఈ వర్గాలలో కుటుంబ నియంత్రణ గురించి విస్తృతంగా ప్రచారం చేయాలి. మిషనరీ జీల్‌తో వారిలో కలిసిపోయి, వారిలో ఒకరై వారందరూ దీనిని అమలు చేసేటట్లు చూడాలి. అప్పుడే మన ఆర్థిక వ్యవస్థ చక్కబడుతుంది"... అని చెప్పిన అమూల్య మార్పులు సుబ్బారాయుడి హృదయం మీద చెరగని ముద్ర వేశాయి.

తక్కువగా ఉన్నవారి దగ్గరికంటే- అసలే పాటించకుండా ఉన్న గిరిజనులతో తన భావి ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చి, దానికి తగిన కార్యక్రమం ఒకటి రూపొందించి అధికారుల అనుమతి తీసుకున్నాడు.

తన కార్యక్రమాన్ని అమలుజరపడానికి ముందుగా అదిలాబాద్ జిల్లాలోని బయట ప్రపంచం బొత్తిగా ఎరగని ఒక కుగ్రామాన్ని ఎంచుకున్నాడు.

అక్కడి గిరిజనులని సమావేశపరచి కుటుంబ నియంత్రణ ఆవశ్యకత గురించి వారికి అర్థమయ్యే భాషలో చక్కగా చెప్పాడు సుబ్బారాయుడు.

విచిత్రమేమిటంటే-

వారి నుంచి, ముఖ్యంగా... వారి స్త్రీలనుంచి ఎటువంటి ప్రతిఘటనా రాకపోగా, ఊహించనంతటి ప్రోత్సాహం లభించింది.

ఆ ఉత్సాహంతో అన్నిటికంటే సులభ మార్గమైన 'నిరోధ్' వాడకాన్ని గురించి వారికి చెప్పాడు. దానిని ఉపయోగించే పద్ధతి చెప్తూ- వెదురుకర్ర ముక్కలకి దానిని తొడిగి చూపించాడు. ఇంటింటికి కావలసినన్ని నిరోధ్‌లు పంచి 'ఒక సంవత్సరం తర్వాత తిరిగి వస్తా'నని చెప్పి వెళ్లాడు.

సంవత్సరం గిర్రున తిరిగింది.

ఆ గ్రామంలో ఆ సంవత్సరంలో జననాలు అతితక్కువగా ఉండి ఉంటాయన్న నమ్మకంతో గ్రామంలో ప్రవేశించాడు.

ఇంటింటా ఉయ్యాలలు చోటు చేసుకోవడం చూసి నిశ్చేష్టుడయ్యాడు.

అతను తేరుకొనేలోగానే- ఆడవారు చీపురుకట్టలు పుచ్చుకుని వచ్చి-

"ఏమిటయ్యా... ఆ తొడుగులతో పిల్లలు పుట్టరన్నావు. అందరిళ్లలోనూ పుట్టారు చూడు!" అంటూ కొట్టినంత పని చేశారు.

సుబ్బారాయుడు హీన స్వరంతో- "అలా వీల్లేదే! ఇంతకీ... మీ పురుషులు నిరోధ్‌లను ఎలా వాడారు?" అని అడిగారు.

"ఇదుగో... నువ్వు చెప్పినట్టే!" అంటూ ఇంట్లోంచి వెదురు కఱ్ఱకు తొడిగిన నిరోధ్‌లను తీసుకువచ్చి చూపించారు.

నిరోధ్‌లను వెదురుకఱ్ఱ ముక్కలకి తొడిగివుంచి, ఎవరి 'పనులు' వారు మామూలుగా జరుపుకోసాగారు. అదీ అసలు సంగతి!

వాటిని చూస్తూనే సుబ్బారాయుడికి మూర్ఛ వచ్చినంత పనయ్యింది.

- మయూరి వార పత్రిక... *13 సెప్టెంబర్ ' 85*

## నాటి మద్రాసు ముచ్చట్లు



ఈ శతాబ్దం తొలి దశకాలలో మద్రాసు నగరంలో బోర్డులు తెలుగు, తమిళం రెండు భాషలలోనూ ఉండేవి. అయితే.. అరవ వాళ్ళు రాయించిన బోర్డుల మీద తెలుగు వాక్యాలు పరమ భయంకరంగా ఉండినా మంచి హాస్యస్ఫోరకంగా ఉండేవట.

ఉదాహరణకి.., హోటళ్ల ముందు "ఇక్కడ భోజనం దొరుకును" అనడానికి బదులు- "ఇచ్చట పిండాకూడు వేయబడును" అని రాసి ఉండేదట.

అలాగే.. మంగలి షాపుల ముందు "ఇక్కడ తలలు నరకబడును" అని ఉండేదట. 'జుట్టు కత్తిరించబడును' లేదా 'క్షవరం చేయబడును' అనడానికి వచ్చిన తిప్పలు ఇవి.

ఇటువంటి ఆసక్తికరమైన విషయాలు ఎన్నో కేసరి కుటీరం వ్యవస్థాపకులు, గృహలక్ష్మి పత్రికా సంపాదకులు అయిన స్వర్గీయ కె.యస్. కేసరిగారి ఆత్మకథలో ఉన్నాయి.